పేద పిల్లలకు చేయూత


గౌన్లను సిద్ధం చేస్తున్న టైలరిస్టులు


సిద్ధంగా గౌన్లు

- సన్మానాల శాలువాలు.. వారికి వస్త్రాలు
- వినూత్న తరహాలో విప్ తనయుడి సేవలు
- బతుకమ్మ పండుగకు 700 నుంచి 1,000 మందికి పంపిణీ చేస్తామంటున్న కార్తీక్

వేములవాడ: ప్రజా సేవలో ఉన్న నేతలకు సన్మానాల సందర్భంగా ఇచ్చే శాలువాలు, కండువాలు చాలాసార్లు వృథా అయిపోతుంటాయి. ఈక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ లాంటి వాళ్లు శాలువాలకు బదులుగా నేత కార్మికులు నేసిన కాటన్ తువాలలు తేవాలని చాలాసార్లు విజ్ఞప్తి చేశారు. అయినా నేతల వద్దకు వచ్చేవారు శాలువాలు, కండువాలు తెస్తూనే ఉన్నారు. వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నివాసానికి వస్తున్న జనం, నాయకులు, అధికారులు, కార్యకర్తలు, ప్రముఖులు తెచ్చే శాలువాలు, కండువాలు కుప్పలుకుప్పలుగా పేరుకుపోతుండడంతో.. ఆయన కుమారుడు ఆది కార్తీక్‌కు ఓ వినూత్న ఆలోచన తట్టింది. శాలువాలు, కండువాలు వృథా కాకుండా ఈసారి ఆ సంప్రదాయానికి ఒక కొత్త అర్థాన్ని జోడించారు. వాటిని అందమైన డిజైన్లలో మలచి గౌన్లు కుట్టిస్తున్నారు. వీటిని పేద పిల్లలకు దుస్తులుగా అందజేయనున్నారు. ఈ కార్యక్రమానికి హానర్ టు హ్యుమానిటీ అనే పేరు పెట్టి సమాజానికి మంచి సందేశాన్నిస్తున్నారు. సన్మానం అనేది కేవలం గౌరవ ప్రదానం మాత్రమే కాకుండా.. అది పేదలకు ఉపయోగపడే మార్గంగా మారొచ్చని ఈ ప్రయత్నం మరోసారి రుజువు చేస్తోంది.

వెయ్యి మందికి పంపిణీ

వచ్చే బతుకమ్మ పండుగ నాటికి 700 మంది నుంచి వెయ్యి మంది చిన్నారులకు ఈ గౌన్లను పంపిణీ చేసేందుకు వాటిని సిద్ధం చేయిస్తున్నారు. పట్టణంలోని ప్రముఖ మహిళా టైలరిస్టుల వద్ద వీటిని కుట్టిస్తున్నారు. వీటిని వీలైనంత వరకు బతుకమ్మ పండుగ లోపు సిద్ధం చేసి నియోజకవర్గంలోని పేదలకు పంచేందుకు సిద్ధపడుతున్నారు.

పేదలకు పంపిణీ చేస్తాం



నాన్నగారికి వచ్చే సన్మానాల శాలువాలు, కండువాలు అల్మారాల్లో నిల్వ ఉండి అవి వృథా అవుతుంటే చూసి చలించిపోయాను. వాటిని దుస్తులుగా మలచి పేద పిల్లలకు ఉపయోగపడేలా చేసి పంపిణీ చేస్తే నిజమైన గౌరవం లభిస్తుందని భావించి హానర్ టు హ్యుమానిటీ పేరుతో ఈ కార్యక్రమం మొదలుపెట్టాం. చిన్నారి ముఖంలో చిరునవ్వు కనబడితే అదే నాకు పెద్ద సంతృప్తి. బతుకమ్మ పండుగకు 700 మంది నుంచి వెయ్యి మందికి పంపిణీ చేసేందుకు సిద్ధం చేస్తున్నాం. ఇందుకు కృషి చేస్తున్న మహిళా టైలరిస్టుల శ్రమకు కృతజ్ఞతలు.

– ఆది కార్తీక్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తనయుడు

క్లుప్తంగా

వయ్యారిభామ నిర్మూలనపై అవగాహన



ఇల్లంతకుంట: పొత్తూరు గ్రామ రైతులకు పంచాయతీ కార్యాలయంలో బుధవారం తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం వయ్యారిభామ కలుపు మొక్క నిర్మూలన వారోత్సవాల సమావేశం ఏర్పాటు చేసింది. మహిళా వ్యవసాయ కళాశాల రావెప్ విద్యార్థినులు రైతులకు వయ్యారిభామ కలుపు మొక్క నివారణపై అవగాహన కల్పించారు. వసుంధర, శ్రేయ, దివ్య, పూజిత, ఆశ్రిత తదితరులు పాల్గొన్నారు

యూరియా సకాలంలో అందించాలి

ఇల్లంతకుంట: రైతులకు యూరియా కొరత లేకుండా సకాలంలో ఎరువులను అందించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మంద అనిల్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం మాట్లాడారు.

బీజేపీ, బీఆర్ఎస్‌తోనే యూరియా కొరత

ముస్తాబాద్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం.. పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే నేడు తెలంగాణలో యూరియా కొరత వచ్చిందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి అన్నారు. బుధవారం కాంగ్రెస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఏఎంసీ చైర్‌పర్సన్ తలారి రాణి, వైస్ చైర్మన్ వెల్ముల రాంరెడ్డి, కొండం రాజిరెడ్డి, అనిత, గుండెల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఓ సర్వే

సిరిసిల్ల: జాతీయ గృహ ప్రయాణాలపై సిరిసిల్లలో ఎన్ఎస్ఓ బుధవారం సర్వే నిర్వహించారు. పట్టణంలో దేశీయ పర్యాటక వ్యయం నిర్వహించే సర్వేతో పర్యటన చేసే సమాచారం ఆధారంగా వస్తువులు సేవలను కొలిచేందుకు సాటిలైట్ అకౌంట్ తెరుస్తామని, ట్రావెల్ టూరిజం డెవలప్‌మెంట్ ఇండెక్స్ రూపొందించి పర్యాటక మంత్రిత్వ శాఖకు అందిస్తామని జాతీయ గణాంక శాఖ కరీంనగర్ అధికారి జి.శ్రీనివాసరావు తెలిపారు. దేశంలో మొదటిసారి నిర్వహిస్తున్న జాతీయ గృహ ప్రయాణ సర్వేతో ప్రజా రవాణా వినియోగంపై పూర్తి సమాచారం లభించేలా ప్రజల ప్రయాణ ప్రవర్తనపై సమాచారం సేకరిస్తామన్నారు.

నిరుపేదలకు వరం ఇందిరమ్మ ఇల్లు

తంగళ్లపల్లి: గూడు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు వరమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోనీ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో పలు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. ఏఎంసీ వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగంగౌడ్, నాయకులు పాల్గొన్నారు.

సమావేశాలు వాయిదా

ఇల్లంతకుంట: ఆగస్టులో జరగాల్సిన ప్రైమరీ, హైస్కూల్, కాంప్లెక్స్ సమావేశాలు వాయిదా పడ్డాయని ఎంఈవో చెప్యాల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఎంఈవో కార్యాలయంలో బుధవారం మాట్లాడారు. ఈనెల 22, 23ల్లో ప్రైమరీ స్కూల్ కాంప్లెక్స్, 29, 30ల్లో హైస్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించాల్సి ఉండగా.. వర్షాల కారణంగా జిల్లా అధికారుల ఆదేశాల ప్రకారం వాయిదా వేసినట్లు పేర్కొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తరలించాలి

ఎల్లారెడ్డిపేట: రాచర్లగొల్లపల్లిలో ప్రాథమిక పాఠశాల వద్ద ఉన్న 2 అంగన్‌వాడీ కేంద్రాలతో చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారని, చిన్నారులకు అనుగుణంగా దగ్గరి ప్రాంతంలో కేంద్రాలను ఏర్పాటు చేయాలని బీజేపీ మహిళా మోర్చా నాయకురాలు జొనకంటి తేజశ్రీ అధికారులను కోరారు. 2 కేంద్రాలు ఒకేచోట ఉండడంతో బస్టాండ్, మిగతా ప్రాంతాల నుంచి వచ్చే చిన్నారులు అవస్థలు పడుతున్నారని, బస్టాండ్ వద్దకు ఒకటి తరలించాలన్నారు.

బీజేపీకి రాజీనామా

ఎల్లారెడ్డిపేట: రాచర్లగుండారం గ్రామానికి చెందిన బోడావత్ రవీందర్‌నాయక్ బీజేపీ రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యవర్గ సభ్యత్వానికి బుధవారం రాజీనామా చేశారు. తన రాజీనామా పత్రాన్ని జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపికి అందజేశారు.

జిల్లా కార్యదర్శిగా సురేందర్‌రావు

కోనరావుపేట: బీజేపీ జిల్లా కార్యదర్శిగా సీనియర్ నాయకుడు గోపాడి సురేందర్‌రావు ఎన్నికయ్యారు. కోనరావుపేట బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, మండల అధ్యక్షుడు మిర్యాల్‌కార్ బాలాజీ ఆయనను సన్మానించారు.

'బీజేపీని విమర్శించడం సిగ్గుచేటు'

గంభీరావుపేట: జిల్లాలో యూరియా కొరత లేదని జిల్లా అధికారులు చెబుతుంటే.. కాంగ్రెస్ పార్టీ నాయకులు మాత్రం అందుకు బీజేపీ కారణమని చెప్పడం సిగ్గుచేటని బీజేపీ మండల అధ్యక్షుడు కోడె రమేశ్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. వాజిద్ హుస్సేన్, మల్లేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీకి నివాళి


వేములవాడఅర్బన్: రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు


ఎల్లారెడ్డిపేటలో నివాళి అర్పిస్తున్న నాయకులు

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్, నందికమాన్ వద్ద కాంగ్రెస్ నాయకులు రాజీగాంధీ జయంతి నిర్వహించారు. ఆయన విగ్రహానికి, చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పట్టణ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్, మండల అధ్యక్షుడు పిల్లి కనకయ్య, నాయకులు తదితరులున్నారు.

సిరిసిల్లటౌన్: గాంధీచౌక్‌లో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేశారు. సంగీతం శ్రీనివాస్, ఆకునూరి బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాముని వనిత నేతృత్వంలో శానిటరీ ప్యాడ్స్ పంపిణీ నిర్వహించారు. మహిళా కాంగ్రెస్ మెంబర్షిప్ ద్వారా సమకూరిన నిధులతో శానిటరీ నాప్కిన్స్ మిషన్ కొనుగోలు చేసి మహిళలకు ఉపాధి కల్పిస్తూ ఉత్పత్తయిన నాప్కిన్లను ఉచితంగా అందజేశారు.

ఎల్లారెడ్డిపేట: దేశం కోసం ప్రాణాన్ని త్యాగం చేసిన గొప్ప వ్యక్తి రాజీవ్‌గాంధీ అని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. మండల కేంద్రంలోని రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. గౌస్, గుండాడి రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేములవాడరూరల్: వేములవాడ మార్కెట్ కమిటీ కార్యాలయంలో పాలకవర్గ సభ్యులు నిర్వహించారు. చైర్మన్ రొండి రాజు, వైస్ చైర్మన్ కనికరపు రాకేశ్, డైరెక్టర్లున్నారు.

రుద్రంగి: మండల కేంద్రంలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. రుద్రంగి ఏఎంసీ చైర్మన్ చెలుకల తిరుపతి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కోనరావుపేట: మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించారు. నాయకులు చందగిరి గోపాల్, రాస రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: దేశ యువతకు స్ఫూర్తి రాజీవ్‌గాంధీ అని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోనీ అన్నారు. మండల కేంద్రంలోని రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. నేరెళ్ల నర్సింగంగౌడ్, లింగాల భూపతి తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: మండల కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. యెల్ల బాల్‌రెడ్డి, తలారి రాణి తదితరులు పాల్గొన్నారు.

బోయినపల్లి: తడగొండ గ్రామ బస్టాండ్ ప్రాంతంలో కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. పండ్లు పంపిణీ చేశారు.

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌కు ఎంపిక

సిరిసిల్లకల్చరల్: హైదరాబాద్‌లోని రామంతాపూర్ పబ్లిక్ స్కూల్‌లో ప్రవేశాల కోసం జిల్లా నుంచి ఆరుగురు విద్యార్థులను ఎంపిక చేశారు. ఇటీవల ఇందుకోసం జిల్లావ్యాప్తంగా మొత్తం 19 మంది దరఖాస్తు చేసుకున్నారు. బుధవారం కలెక్టరేట్ కాంప్లెక్స్‌లో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా డ్రా నిర్వహించారు. ఇద్దరు అమ్మాయిలు, నలుగురు అబ్బాయిలను ఎంపిక చేసినట్లు అధికారికంగా ధ్రువీకరించారు.


లక్కీ డ్రా నిర్వహిస్తున్న కలెక్టర్

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి


రాచర్లబొప్పాపూర్‌లో సైకిళ్లు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

ఎల్లారెడ్డిపేట: విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి కోరారు. మండలంలోని రాచర్లబొప్పాపూర్, రాచర్లతిమ్మాపూర్‌లోని హైస్కూల్ పదో తరగతి విద్యార్థులకు మోదీ కానుకగా కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సమకూర్చిన 229 సైకిళ్లను బుధవారం పంపిణీ చేశారు. ఎంఈవో కృష్ణహరి, హెచ్ఎం మధుమాలతి, జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నాల తిరుపతిరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శులు దాసరి గణేశ్, నంది నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

తంగళ్లపల్లి: మండల ప్రజాపరిషత్ అభివృద్ధి అధికారి కె.లక్ష్మీనారాయణను బుధవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. టోనీ మాట్లాడుతూ.. స్వాతంత్య్ర వేడుకల సందర్భంగా ఉత్తమ ఎంపీడీవోగా అవార్డు అందుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు. నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలకు కంప్యూటర్లు వితరణ

తంగళ్లపల్లి: ఇందిరమ్మకాలనీ ప్రభుత్వ పాఠశాలకు బుధవారం ఎన్ఆర్ఐ జూపల్లి శ్రీనివాసరావు రూ.లక్ష విలువైన 2 కంప్యూటర్లు, 55 ఇంచెస్ టీవీ వితరణ చేశారు. మండల విద్యాధికారి భూక్యా రాజు ఆధ్వర్యంలో పాఠశాల ఉపాధ్యాయులు శాలువాతో సన్మానించారు.

కార్యవర్గం ఎన్నిక

తంగళ్లపల్లి: బద్దెనపల్లి సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల నూతన పేరెంట్స్ కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా గుగ్గిళ్ల మమత, ఉపాధ్యక్షుడిగా బంటు బాబు, ప్రధాన కార్యదర్శిగా ఏనుగుల రమణ, కార్యదర్శిగా కూలేరి కిషోర్‌కుమార్, కోశాధికారిగా కొంపెల్లి శ్యామ్, పబ్లిసిటీగా గుడిసె గంగయ్య, సభ్యులుగా కనకయ్య, లచ్చయ్య, ప్రభాకర్, దేవదాస్ ఎన్నికయ్యారు.

పీహెచ్‌డీ పట్టా ప్రదానం


పట్టా స్వీకరిస్తున్న రాగమాలిక

ఇల్లంతకుంట: రహీంఖాన్‌పేట మోడల్ స్కూల్ ఉపాధ్యాయురాలు గోవాతోటి రాగమాలిక పీహెచ్‌డీ పట్టా పొందారు. ఉస్మానియా యూనివర్సిటీలో ఠాగూర్ ఆడిటోరియంలో నిర్వహించిన స్నాతకోత్సవంలో ఓయూ వైస్ ఛాన్సలర్ కుమార్ మొలుగురామ్, ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణ చేతుల మీదుగా పట్టా స్వీకరించారు.

బాల సాహితీవేత్తకు పురస్కారం


రాణిప్రసాద్

సిరిసిల్లటౌన్: ప్రముఖ బాల సాహితీవేత్త డా.కందేపి రాణిప్రసాద్‌కు శ్రీశ్రీ కళావేదిక తెలుగు భాషా కీర్తి పురస్కారాన్ని ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నరసరావుపేటలో ఆగస్టు 31న జరగబోయే తెలుగు భాషా దినోత్సవ కార్యక్రమంలో పురస్కారం ప్రదానం చేయనున్నట్లు శ్రీశ్రీ కళావేదిక చైర్మన్ కత్తిమండ ప్రతాప్ తెలిపారు.

వాలీబాల్ పోటీలకు ఎంపిక


శృతిక

ఎల్లారెడ్డిపేట: రాచర్లబొప్పాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని డి.శృతిక అండర్–15 విభాగంలో జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైంది. ఈనెల 26, 27ల్లో మహారాష్ట్రలోని పుణెలో జరిగే పోటీల్లో పాల్గొంటుందని పీడీ అక్బర్ తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

బోయినపల్లి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో ఈనెల 18, 19ల్లో జరిగిన రాష్ట్రస్థాయి అండర్–15 వాలీబాల్ పోటీల్లో విలాసాగర్ హైస్కూల్‌కు చెందిన నలుగురు విద్యార్థులు పాల్గొన్నట్లు హెచ్ఎం బొలగం శ్రీనివాస్ బుధవారం తెలిపారు. ఎస్.స్పందన, ఎం.భవ్యశ్రీ, ఆర్.హస్విక బాలికల విభాగంలో, ఎస్.శివరామకృష్ణ బాలుర విభాగంలో జిల్లా నుంచి పాల్గొన్నారని పేర్కొన్నారు.

రేపటి నుంచి పోటీలు

చందుర్తి: జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 22, 23ల్లో ఎస్‌జీఎఫ్ ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారి వినయ్‌కుమార్ తెలిపారు. 22న అండర్–14, 17 బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్ పోటీలు, 23న అండర్–14, 17 బాలురలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్ పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

రాహుల్‌గాంధీకి ఉద్యమకారుల లేఖ

ఇల్లంతకుంట: తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల స్థలం ఇవ్వాలని ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీకి తెలంగాణ ఫోరం మండల అధ్యక్షుడు బట్టి చంద్రమౌళి, సభ్యులు బుధవారం లేఖ పోస్ట్ చేశారు.

రక్తదానం

వేములవాడరూరల్: కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో కామారెడ్డిలోని సిరికొండకు చెందిన 11 ఏళ్ల సోహెల్ అనే బాలుడు తలసేమియా వ్యాధితో బాధపడుతూ చేరాడు. అత్యవసరంగా బీ–పాజిటివ్ రక్తం అవసరముందని వైద్యులు సూచించారు. వెంటనే బాలుడి తండ్రి నూకలమర్రి గ్రామానికి చెందిన సోమినేని బాలుకు ఫోన్ చేశాడు. వేములవాడ ప్రాంతంలో ఉన్న బాలు కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి రక్తాన్ని అందించాడు. ఇలా ఇప్పటివరకు 57సార్లు రక్తదానం చేశాడు.

క్రీడాదుస్తులు అందజేత

కోనరావుపేట: సుద్దాలలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త కచ్చకాయల మహేశ్ క్రీడాదుస్తులను అందజేశారు. బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థి అయిన మహేశ్ రూ.15వేల విలువైన డ్రెస్సులను అందించారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

బోయినపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలనే ఉద్దేశంతో టీఎల్ఎం మేళా నిర్వహిస్తున్నట్లు క్వాలిటీ కోఆర్డినేటర్ శైలజ పేర్కొన్నారు. కొదురుపాక హైస్కూల్‌లో బుధవారం మండలస్థాయి టీఎల్ఎం మేళా నిర్వహించారు. శ్రీనివాస్, ఉషారాణి, మధుసూదన్‌రావు తదితరులున్నారు.

అన్నప్రాసన

చందుర్తి: జోగాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శంకరమ్మ బుధవారం అన్నప్రాసన కార్యక్రమాన్ని చేపట్టారు. అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు రమాదేవి, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

డీజేలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు


బోయినపల్లిలో డీజే యజమానులతో సీఐ సమావేశం

బోయినపల్లి: గణేశ్ మండపాల వద్ద, శోభాయాత్రలో డీజేలు ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్ హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మండల పరిధిలోని డీజే యజమానులతో బుధవారం సమావేశం నిర్వహించారు.

కోనరావుపేట: గ్రామాల్లో గణేశ్ మండపాల నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్సై ప్రశాంత్‌రెడ్డి అన్నారు. నాగారం గ్రామంలో బుధవారం కమ్యూనిటీ పోలీస్ ప్రోగ్రాం నిర్వహించారు. గ్రామ యువకులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: రానున్న గణేశ్ నవరాత్రి వేడుకలు, మిలాద్–ఉన్–నబీ వేడుకలను శాంతియుతంగా జరుపుకోవాలని సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్సై రాహుల్‌రెడ్డి కోరారు. ఎల్లారెడ్డిపేటలోని ఠాణాలో బుధవారం పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా అన్ని మతాలకు చెందిన వారు సహనం పాటించాలని సూచించారు.

వేములవాడరూరల్: గ్రామాల్లో ఏర్పాటు చేసే వినాయక మండపాల వద్ద నిబంధనలకు విరుద్ధంగా డీజేలు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని ఎస్ఐ అంజయ్య తెలిపారు. మండలంలోని వినాయక మండపాల నిర్వాహకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

బీడీ కార్మిక పిల్లల చదువుకు ప్రోత్సాహం


మాట్లాడుతున్న ఎంపీడీవో రాధ

చందుర్తి: బీడీ కార్మికుల పిల్లల చదువుల ప్రోత్సాహానికి ప్రభుత్వం ఉపకార వేతనాలను అందిస్తోందని చందుర్తి ఎంపీడీవో రాధ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో బీడీ కార్మికులకు ఉపకార వేతనాల దరఖాస్తులు చేసుకునేందుకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. మండల విద్యాధికారి వినయ్‌కుమార్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్, విద్యార్థుల తల్లులు పాల్గొన్నారు.

సిరిసిల్లకల్చరల్: బీడీ కార్మిక పిల్లలకు కేంద్ర ప్రభుత్వం అందించే స్కాలర్‌షిప్‌ల కోసం ఈనెల 31 లోపు దరఖాస్తు చేసుకోవాలని కార్మిక సంక్షేమ శాఖ ఒక ప్రకటన జారీ చేసింది. ప్రస్తుత విద్యాసంవత్సరంలో 1 నుంచి పీజీ కోర్సుల దాకా చదువుకుంటున్న విద్యార్థులు నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్ ద్వారా తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు.

పేదింటి ఆడపడుచులకు వరం కల్యాణలక్ష్మి


లబ్ధిదారులకు చెక్కులు అందించిన నాయకులు, అధికారులు

ముస్తాబాద్: పేదింటి ఆడపడుచులకు కల్యాణలక్ష్మి పథకం వరంగా మారిందని ఏఎంసీ చైర్‌పర్సన్ తలారి రాణి అన్నారు. ముస్తాబాద్ రైతు వేదికలో 77 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను బుధవారం పంపిణీ చేశారు. తహసీల్దార్ సురేశ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ వెల్ముల రాంరెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి కొండం రాజిరెడ్డి, అనిత, గుండెల్లి శ్రీను, భాను, ప్రశాంత్, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

చలో హైదరాబాద్ విజయవంతం చేయాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

కోనరావుపేట: సీపీఎస్ రద్దు కోరుతూ నిర్వహించనున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడ్ల కిషన్ అన్నారు. మండల శాఖ ఆధ్వర్యంలో ధర్మారం ఉన్నత పాఠశాలలో బుధవారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించి పోస్టర్ ఆవిష్కరించారు. మండల విద్యాధికారి మురళినాయక్, వెంగళ మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

స్తంభంపల్లి బ్రిడ్జి పూర్తి చేయండి


మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

బోయినపల్లి: బోయినపల్లి నుంచి వేములవాడ వెళ్లే దారిలో స్తంభంపల్లిలో లెవల్ కల్వర్టు వద్ద నిర్మిస్తున్న హైలెవల్ వంతెన పనులు త్వరగా పూర్తి చేయాలని బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు ఉదారి నర్సింహాచారి, మండల మాజీ అధ్యక్షుడు గుడి రవీందర్‌రెడ్డి కోరారు. మండల కేంద్రంలో బుధవారం మాట్లాడుతూ.. రెండేళ్లుగా బ్రిడ్జి పనులు పూర్తి కాకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. నాయకులు జువ్వెంతుల శ్రీనివాసరెడ్డి, రాజూరి కిరణ్ ఉన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తికి గాయాలు

ముస్తాబాద్: ముస్తాబాద్ తెలంగాణ తల్లి చౌరస్తా వద్ద బుధవారం ఆర్టీసీ బస్సు, బైక్ ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ముస్తాబాద్ నుంచి సిద్దిపేట వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సును చౌరస్తాలో మరో వీధి నుంచి బైక్‌పై వస్తున్న రామచంద్రం(32) ఢీకొట్టాడు. రామచంద్రంకు కాలు విరిగింది. క్షతగాత్రుడిని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

భార్య తల పగిలగొట్టిన భర్తపై కేసు

చందుర్తి: భార్య తలను క్రికెట్ బ్యాట్‌తో పగలగొట్టిన భర్తపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై జిల్లెల రమేశ్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. రామరావుపల్లె గ్రామానికి చెందిన లహరికి తల్లిగారింటికి వెళ్లే విషయమై మంగళవారం తన భర్త సంపత్‌కుమార్‌తో గొడవ జరిగింది. ఇద్దరి మధ్య మాటామాట పెరగడంతో.. లహరి పుస్తెల తాడును లాగి పక్కనే ఉన్న క్రికెట్ బ్యాట్‌తో తలపై బాదాడు. లహరి తలకు బలమైన గాయం కావడంతో మంగళవారం ఆసుపత్రిలో వైద్యం చేయించుకొని భర్తపై బుధవారం చందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై చెప్పారు.

రేపు పనుల జాతరకు శ్రీకారం

సిరిసిల్ల: జిల్లాలో ఉపాధిహామీ పనులు జాతర–2025ను శుక్రవారం నిర్వహించేందుకు జిల్లా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో పూర్తయిన పనుల ప్రారంభం, కొత్త వాటికి భూమి పూజ చేయనున్నారు. జిల్లాలోని 12 మండలాల పరిధిలోని 260 గ్రామాలలో ఒకే రోజు శుక్రవారం పనుల జాతర–2025 నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉపాధిహామీ పథకం, వాటర్‌షెడ్, ఆర్‌డబ్ల్యూఎస్, స్వచ్ఛభారత్ వంటి పనులు చేయనున్నారు. వివిధ పథకాల్లోని లబ్ధిదారులకు మంజూరు పత్రాలను గ్రామసభలలో ఇవ్వాలని, ఉపాధిహామీ పథకంలో ఎక్కువ రోజులు పనిచేసిన కూలీలను, దివ్యాంగులను, పారిశుధ్య కార్మికులను, హరిత సంరక్షకులను సన్మానించనున్నారు.

తక్కువ ధరకే మెటీరియల్ అందించాలి

సిరిసిల్ల అర్బన్: జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఇసుక, మొరం, మట్టి కొరత లేకుండా తక్కువ ధరలకు అందించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎగమంటి ఎల్లారెడ్డి అన్నారు. బుధవారం సిరిసిల్లలోని కార్మిక సంఘం భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కోడం రమణ, రాపెల్లి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పవిత్రత కాపాడాలి

సిరిసిల్లటౌన్: పాత బస్టాండులోని కట్ట మైసమ్మ ఆలయ పవిత్రతను కాపాడేలా బల్దియా వెంటనే చర్యలు తీసుకోవాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్ కోరారు. బుధవారం పార్టీ నేతలు, స్థానికులతో కలిసి మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషాకు వినతిపత్రాన్ని అందజేసి మాట్లాడారు. ఆలయానికి ఆనుకొని ఉన్న సులభ్ కాంప్లెక్సును సమీపంలోని ఖాళీ స్థలానికి మార్చాలన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

వీర్నపల్లి: రాశిగుట్టతండాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ బాలకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం ఇంటింటా జ్వర సర్వే నిర్వహించారు. వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

కొనసాగుతున్న ఎత్తిపోతలు

ఇల్లంతకుంట: అనంతగిరి అన్నపూర్ణ ప్రాజెక్టులోకి మిడ్ మానేరు ప్రాజెక్టు నుంచి 3,200 క్యూసెక్కుల నీరు బుధవారం వచ్చి చేరింది. అన్నపూర్ణ ప్రాజెక్టు నుంచి 3,300 క్యూసెక్కుల నీరు సిద్దిపేట జిల్లాలోని రంగనాయక సాగర్ ప్రాజెక్టులోకి వెళ్తోందని ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.

వ్యాపారులకు రాజకీయాలు వద్దా..

సిరిసిల్ల అర్బన్: సిరిసిల్ల వ్యాపారస్తులు వ్యాపారం చేయకుండా రాజకీయం చేస్తున్నారని కేటీఆర్ అన్నారని, వ్యాపారులకు రాజకీయం అవసరం లేదా అని కాంగ్రెస్ చేనేత సెల్ జిల్లా అధ్యక్షుడు గోనె ఎల్లప్ప ప్రశ్నించారు. బుధవారం ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సిరిసిల్ల వ్యాపారస్తులను తీసుకెళ్లి మునుగోడులో ఎన్నికల ప్రచారం చేయించడం రాజకీయం కాదా అని అన్నారు. అన్నల్దాస్ భాను, గోరిట్యాల లక్ష్మీపతి, గాజుల నరేశ్, దొంత దేవదాస్, లక్ష్మణ్, వేణు, దత్తు, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఇసుక రవాణాపై నజర్

తంగళ్లపల్లి: ఇందిరమ్మ ఇళ్ల పేరుతో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లపై తంగళ్లపల్లి పోలీసులు దృష్టి సారించారు. బుధవారం ఎటువంటి అనుమతులు లేకుండా ఇందిరమ్మ ఇళ్ల పేరుతో ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను తనిఖీ చేశారు. పోలీసులను గుర్తించి బెంబేలెత్తిపోయిన ట్రాక్టర్ డ్రైవర్లు తప్పించుకొని పారిపోయారు. ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, కేసులు నమోదు చేస్తామని ఎస్సై ఉపేంద్రచారి హెచ్చరించారు.

తుంపర వర్షం

సిరిసిల్ల: జిల్లాలో బుధవారం తుంపర వర్షం కురిసింది. బోయినపల్లిలో 4.4 మిల్లీమీటర్లు, రుద్రంగిలో 1.3, చందుర్తిలో 0.3, వేములవాడరూరల్‌లో 4.0, సిరిసిల్లలో 0.4, కోనరావుపేటలో 0.7, వీర్నపల్లిలో 3.7, ఎల్లారెడ్డిపేటలో 1.4, గంభీరావుపేటలో 2.3, ముస్తాబాద్‌లో 3.5, తంగళ్లపల్లిలో 0.5, ఇల్లంతకుంటలో 0.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.